

మహబూబ్‌నగర్ వార్త

నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట




సంసద్ ఖేల్ మహోత్సవ్‌ను ప్రారంభిస్తున్న ఎంపి డికె అరుణ

# ఘనంగా ప్రధాని సంసద్ ఖేల్ మహోత్సవ్

### జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించిన ఎంపి డికె అరుణ

**నారాయణపేట, ఏప్రిల్ 9 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా కేంద్రం లోని ప్రభుత్వ జూనియర్ కాలేజ్ గ్రౌండ్‌లో ప్రధాన మంత్రి సంసద్ ఖేల్ మహోత్సవ్‌ను ఎంపీ డీకే అరుణ ఘనంగా ప్రారంభించారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం, వివిధ మండలాల కోఆర్డినేటర్లకు క్రికెట్, వాలీబాల్ కిట్లను పంపిణీ చేశారు. ఆపై టాస్ వేసి క్రీడా పోటీలను ప్రారంభించారు. క్రీడాకారుల్లో ఉత్సాహం నింపేందుకు ఎంపీ స్వయంగా బ్యాటింగ్ చేసి క్రికెట్ ఆడగా, అనంతరం వాలీబాల్ సర్వీస్ ఇచ్చి వాలీబాల్ ఆటలోనూ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ డీకే అరుణ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల యువతను క్రీడల వైపు ప్రోత్సహించి వారి ప్రతిభను వెలికితీయడం లక్ష్యంగా ఈ మహోత్సవాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం, ముఖ్యంగా ఖేలో ఇండియా కార్యక్రమం ద్వారా క్రీడాకారులకు ప్రోత్సాహం అందిస్తోందన్నారు. క్రికెట్, వాలీబాల్, ఖోఖో కబడ్డీ వంటి క్రీడలను మండల, అసెంబ్లీ, పార్లమెంట్ స్థాయిలలో నిర్వహిస్తున్నామని చెప్పారు. మండలస్థాయిలో గెలిచిన జట్లు తదుపరి స్థాయిలకు ఎంపికవుతాయని వివరించారు. మహిళల జట్లకు ప్రత్యేక బహుమతులు ఉంటాయని కూడా వెల్లడించారు. ప్రస్తుతం నాలుగు క్రీడలతో ప్రారంభించిన ఈ మహోత్సవాన్ని, వచ్చే ఏడాది మరింత విస్తృతంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు క్రీడా రంగంలో ముందుకు వెళ్లేందుకు తనవంతు సహకారం అందిస్తానన్నారు. క్రీడలద్వారా శారీరక, మానసిక ఉల్లాసం పెరుగుతుందని, చదువుతో పాటు ఆటలలోనూ రాణించాలని సూచించారు. క్రీడల్లో రాణించి దేశానికి కీర్తి తేవాలని యువతను ప్రోత్సహించారు. ఈ మహోత్సవం ముగింపు వేడుకలను ఈనెల24న మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆ వేడుకకు తెలంగాణ గవర్నర్ హాజరై విజేతలకు బహుమతులు అందజేయనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ ఇంచార్జ్ ముచ్చర్లపల్లి జనార్ధన్ రెడ్డి, పిఎంఎస్‌కెయం నారాయణపేట జిల్లా కన్వీనర్ తిరుపతి రెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు నాగురావు నామాజీ ,బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రతంగ్ పాండు రెడ్డి, జిల్లా బీజేపీ అధ్యక్షులు సత్య యాదవ్, జిల్లా బీజేపీ మాజీ అధ్యక్షులు శ్రీనివాస్, కొండయ్య, మున్సిపల్ చైర్మన్ కొండా శ్వేత, వైస్ చైర్మన్ మంజుల రెడ్డి, సత్య రఘుపాల్ రఘురామయ్య ,ఉమేష్ ,రాజశేఖర్ రెడ్డి లక్ష్మీ శ్యామ్ సుందర్ , పిఎమ్ఎస్‌కె మహబూబ్ నగర్ కన్వీనర్ కిరణ్ కుమార్ రెడ్డి తదితర ముఖ్య నేతలు,మండల కన్వీనర్లు, కో ఆర్డినేటర్లు పాల్గొన్నారు.



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

### ఎయిడ్స్ వ్యాధి నిర్మూలనపై

# అవగాహన ర్యాలీ

**గద్వాల ఏప్రిల్ 9, ప్రభాతవార్త :** ఎయిడ్స్ వ్యాధి సంక్రమించకుండా ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ పిలుపునిచ్చారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమాల్లో భాగంగా నిర్వహిస్తున్న ఆరోగ్య వారోత్సవాల్లో గురువారం ఎయిడ్స్ వ్యాధి నిర్మూలనకు సంబంధించిన కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం గద్వాల జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఎయిడ్స్ అవగాహన ర్యాలీని జిల్లా కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ప్రభుత్వ ఆసుపత్రి నుంచి అంబేద్కర్ చౌరస్తా మీదుగా కృష్ణవేణి చౌరస్తా వరకు నిర్వహించిన ర్యాలీలో అతిధులు, వైద్యాధికారులు, నర్సింగ్, మెడికల్ కళాశాలల విద్యార్థులు ఎయిడ్స్ నిర్మూలనపై ముద్రించిన ప్లకార్డులు ప్రదర్శిస్తూ, నినాదాలు చేస్తూ ర్యాలీలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎయిడ్స్ అనేది హెచ్ఐవి వైరస్ కారణంగా సంక్రమించే ఒక వ్యాధి అని, ఇది శరీరంలోని రోగ నిరోధక వ్యవస్థను దెబ్బతీస్తుందన్నారు. అసురక్షిత లైంగిక సంబంధాలు, ఎయిడ్స్ వ్యాధి కలిగిన వ్యక్తికి చేసిన సూదులతోనే ఇతరులకు చేయడం, స్క్రీనింగ్ చేయని రక్తమార్పిడి, తదితర కారణాలతో ఎయిడ్స్ వ్యాధి ఒకరి నుంచి మరొకరికి సంక్రమిస్తుందన్నారు. తీవ్రమైన బరువు తగ్గుదల, చర్మంపై గాయాలు, దీర్ఘకాలిక విరేచనాలు, జ్వరం, వాంతులు వంటి లక్షణాలు కనిపిస్తే ఎయిడ్స్ పరీక్షలు చేసుకోవాలని సూచించారు. ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులు ఏఆర్ టీ చికిత్స తీసుకుంటే వైరస్ నియంత్రించడంలో సహాయపడుతుందన్నారు. అలాగే సకారాత్మక జీవనశైలి, ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అనంతరం ఎయిడ్స్ వ్యాధి నిర్మూలన ప్రతిజ్ఞను చేయించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, డిఎంహెచ్ఓ సంధ్య కిరణ్మయి, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి పర్యవేక్షకులు ఇందిర, ప్రోగ్రాం అధికారి రాజు, ఇతర వైద్యాధికారులు, డాక్టర్లు, వైద్య సిబ్బంది, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

### ఏజెన్సీ ప్రాంత రైతుల భూ సమస్యలను

# పరిష్కరించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం

### తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ రైతు కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి



మాట్లాడుతున్న చైర్మన్ కోదండ రెడ్డి

**అచ్చంపేట, ఏప్రిల్ 9 ప్రభాతవార్త :** నల్లమల్ల ఏజెన్సీ ప్రాంతాల రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలను పరిష్కరించేందుకు తెలంగాణ రాష్ట్రవ్యవసాయ రైతు కమిషన్ కృషి చేయనున్నట్లు రాష్ట్ర రైతు కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి అన్నారు. గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గ పరిధిలోని అమ్రాబాద్ మండల కేంద్రంలో చైర్మన్ ఎం.కోదండ రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, అచ్చంపేట -మిగతా2లో..

# నాలుగు రైతుబంధులకు ఎగనామం

- నల్లమల్ల పులి కాదు.. పిల్లి
- వంద రోజుల్లో హామీల అమలు అని నేటికీ చేయలేదు
- రుణమాఫీ 100శాతం అయిందని నిరూపిస్తే రాజీనామా చేస్తా..
- లేకుంటే నువ్వు చేస్తావా..
- మీ కమిషన్ల కోసం ప్రాజెక్టులు కట్టొద్దు..
- గొల్లపల్లి చీరకపల్లి రిజర్వాయర్ అవసరం లేదు
- ఏదుల రిజర్వాయర్ నుంచి నీళ్లు అందుతాయి..
- సీఎం రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి హరీష్ రావు ఫైర్

**వనపర్తి/ రేవల్లి, ఏప్రిల్ 9, ప్రభాతవార్త :** ఇప్పటికే నాలుగు రైతుబంధులు ఎగ్గొట్టారని, కేవలం ఒక్కసారి మాత్రమే పూర్తిగా అమలు చేశారని మాజీ మంత్రి హరీష్‌రావు ఆరోపించారు. వనపర్తి జిల్లాలో ఏగ్రామానికి అయినా వెళ్దాం 100% రుణమాఫీ అమలు అయిందంటే నేను రాజీనామా చేస్తా, కాకపోతే నువ్వు చేస్తావా అంటూ సీఎం రేవంత్ రెడ్డికి సవాల్ విసిరారు. వనపర్తి జిల్లా ఎద్దుల మండల పరిధిలో గొల్లపల్లి వద్ద ఏర్పాటుచేసిన సభలో ఆయన ప్రసంగించారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును కావాలనే పెండింగ్‌లో పెట్టారని ఆరోపించారు. బిఆర్ఎస్ హయాంలో



మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీష్‌రావు

పాలమూరు జిల్లాను అద్భుతంగా ప్రగతి పథంలో నడిపించామన్నారు. వలసలు వాపస్ అని విఆర్ఎస్ స్థాయిలో వార్తలు రాసారని, పాలమూరు పచ్చని రంగు వేసుకున్నదని పేపర్లో హెడ్డింగ్ లు కూడా వచ్చాయని గుర్తు చేశారు. రెండున్నర ఏళ్లలో కనీసం 10,000 ఎకరాలకు నీళ్లు అయినా ఇచ్చావా రేవంత్ రెడ్డి అని ప్రశ్నించారు. ఒకరు దత్తత అన్నారు ఒక ఆయన వలస జిల్లాను చేశాడు అని 60 ఏళ్లలో మీరు 25 రిజర్వాయర్లు కడితే, 9 ఏళ్లలో 65 టీఎంసీల రిజర్వాయర్లు నిర్మించామని హరీష్ రావు వివరించారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం మేజర్ భాగం పనులు తాము పూర్తి చేశామని, మిగిలిపోయిన చిన్న పనులు కూడా పూర్తి చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వానికి చేత కావడం లేదు అంటూ ఫైర్ అయ్యారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇప్పటికే మూడు సీజన్లు అయిపోయాయని, 50 టీఎంసీల నీళ్ల నిలుపుకునే అవకాశం ఉండేదని, అనేక కేసులు వేసి ప్రాజెక్టు పనులు అడ్డుకట్ట వేశారని చెప్పారు. కేఎల్ఐలో వనపర్తి నియోజకవర్గం లేదని నిరంజన్ రెడ్డి చొరవ తీసుకొని ఒప్పించి వనపర్తి జిల్లాకు నీళ్లు ఇప్పించారని చెప్పారు. గొల్లపల్లి చీర్కపల్లి రిజర్వాయర్ అవసరం -మిగతా4లో..



హాజరైన నాయకులు, కార్యకర్తలు, ప్రజలు

### జబర్దస్త్ చేస్తే ఒప్పుకోము

# రైతులకు బాటగా నిలుస్తాం

### రెండున్నర ఏండ్లలో పదివేల ఎకరాలకు నీళ్లు ఇచ్చావా రేవంత్ రెడ్డి

### 13 వందల కోట్లతో రిజర్వాయర్ అవసరమా

### 7 టిఎంసిల ఏదుల రిజర్వాయర్ పక్కనే ఉందిగా

### మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి



బహిరంగ సభలో మాట్లాడుతున్న మాజీ మంత్రి

**వనపర్తి, ఏప్రిల్ 9, ప్రభాతవార్త:** ఏదుల మండలం గొల్లపల్లి చీర్కపల్లి రిజర్వాయర్‌కు వ్యతిరేకంగా దీక్ష విరమంప జేసి రైతులను పరామర్శించిన మాజీ మంత్రులు హరీష్ రావు, సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, లక్ష్మారెడ్డిలు చిర్కపల్లి గొల్లపల్లి రైతుల ఉసురు ప్రభుత్వానికి తగులుతుందని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం గొల్లపల్లి చీర్కపల్లి రిజర్వాయర్ కు వ్యతిరేకంగా ఏర్పాటుచేసిన బహిరంగ సభలో వారు మాట్లాడుతూ 1300 కోట్లతో రిజర్వాయర్ అవసరమా అని పక్కనే ఏడు టీఎంసీల ఏదుల రిజర్వాయర్ ఉండగా కమిషన్ల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం గొల్లపల్లి రిజర్వాయర్ ను ఏర్పాటు చేస్తుందని మాజీ మంత్రి మండిపడ్డారు. ప్రజల సమ్మతితో రిజర్వాయర్ చేపడితే అభ్యంతరం లేదన్నారు. ఏనాడైనా సీఎం,నీటిపారుదల శాఖ మంత్రి ఇక్కడ సమీక్షా నిర్వహించారా అని ప్రశ్నించారు.పాలమూరు రంగారెడ్డి లో భూమి సేకరణకు 73 సార్లు పర్యటించి,వలసలను ఆపేందుకు,సాగునీటిని అందించేందుకు రైతులు,ప్రజలు కాళ్ల పట్టుకొని ఒప్పించానని మాజీమంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ముందుగా రైతుప్రాభిప్రాయం సేకరణ చేయండి అని కనీసం 80శాతం రైతుల ఆమోదంతో ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేయాలని అంతేకానీ జబర్దస్త్ చేసి రైతులను బెదిరించి రైతుల భూములను లాక్కోవాలని చూస్తే మరో లఘుచర్ల ఘటన జరుగుతుందని -మిగతా4లో..

# మహిళా సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట

### భూత్పూర్ నుండి కొత్తపల్లి గ్రామానికి కోటి యాభై లక్షలతో బ్రిడ్జి నిర్మాణానికి భూమి పూజ

### ఇందిరా మహిళా శక్తి ఆధ్వర్యంలో రూ.3 కోట్లతో సోలార్ పవర్ ప్లాంటు

### రాష్ట్ర క్రీడా, పాడి పరిశ్రమాభివృద్ధి, పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి



మాట్లాడుతున్న మంత్రి వాకిటి శ్రీహరి

**మక్తల్ టౌన్, ఏప్రిల్ 9 ప్రభాతవార్త :** మక్తల్ నియోజకవర్గం సత్యావార్ గ్రామంలో ఇందిరా మహిళా శక్తి ఆధ్వర్యంలో రూ.3కోట్లతో నిర్వహించనున్న సోలార్ పవర్ ప్లాంట్ నిర్మాణానికి ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూప్రజా ప్రభుత్వం మహిళా సంక్షేమానికి అత్యంత ప్రతిష్టాత్మకంగా సంక్షేమ కార్యక్రమాలను చేపడుతోందని తెలిపారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా ముందుకెళ్తుందని వెల్లడించారు. ఇప్పటికే నారాయణపేట జిల్లాలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో 11ఆర్టీసీ అద్దె బస్సులను నిర్వహిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఇలా సమాఖ్య ఆధ్వర్యంలో పెట్రోల్ బంకులు కూడా దిగ్విజయవంతంగా నిర్వహిస్తున్నారని మంత్రి కితాబునిచ్చారు. మహిళాసంఘాలు అడిగినవెంటనే బ్యాంకులు 20 లక్షల రూపాయల రుణాలు మంజూరు చేస్తున్నాయని గుర్తు చేశారు. ఆపద వచ్చి ఎవరైనా సంఘంలోని మహిళా సభ్యురాలు చనిపోతే ఆ మహిళ తీసుకున్న రుణం మాఫీ చేయడంతో పాటు తిరిగి ప్రభుత్వమే ఆ మహిళ కుటుంబానికి ఐదులక్షలు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో మొదటిసారిగా మూడు కోట్ల వ్యయంతో మహిళా సంఘాల ఆధ్వర్యంలో వన్ మెగా వాట్ సోలార్ పవర్ ప్లాంట్ నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ పవర్ ప్లాంట్ నిర్మాణం పూర్తయితే సంవత్సరానికి 26లక్షల రూపాయలు మహిళ సంఘాల ఖాతాల్లో జమ అయితుందని మంత్రి తెలిపారు. ఇంకా మహిళా సంఘంలో సభ్యులు పెరగాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. రాబోయే రోజుల్లో పాడి పరిశ్రమను కూడా మహిళా సమాఖ్య ద్వారా నిర్వహించేలా ప్రణాళికలు రూపొందించనున్నట్లు మంత్రి స్పష్టం చేశారు. మహిళా సాధికారికతతోనే గ్రామాలు, జిల్లాలు, రాష్ట్రాలు బాగుపడుతుయన్నారు మంత్రి శ్రీహరి. రాష్ట్రంలో ఉచిత బస్సు ప్రయాణం వల్ల ఆడబిడ్డలు 10 వేల కోట్లు ఆదా చేశారన్నారు. ఒక్క నారాయణపేట జిల్లాలోని 1200 కోట్ల రూపాయలు ఆర్టీసీకి ప్రభుత్వం చెల్లించిందని మంత్రి వెల్లడించారు. గత ప్రభుత్వం మహిళలకు ఇచ్చిన చీరలు చేలల్లో అడవి జంతువులు రాకుండా కట్టేవారని మంత్రి ఎద్దేవా చేశారు. ప్రజా ప్రభుత్వం వచ్చాక మహిళలకు నాణ్యమైన చీరలను అందించిందని తెలిపారు. ఆడబిడ్డలు తమ తమ పిల్లలను మంచిగా చదివించాలని, మీ పిల్లల భవిష్యత్తు ను చదువు మాత్రమే మారుస్తుందని హితవు పలికారు. అంతకు ముందు భూత్పూర్ నుండి కొత్తపల్లి గ్రామానికి కోటి యాభై లక్షలతో నిర్మించతలపెట్టిన బ్రిడ్జి నిర్మాణానికి రాష్ట్ర క్రీడా, పాడి పరిశ్రమాభివృద్ధి, పశు సంవర్ధక శాఖ మంత్రి శంకుస్థాపన చేశారు. రేపటి నుండే బ్రిడ్జి పనులు ప్రారంభం అవుతున్నాయని తెలిపారు. అతి త్వరలో వంతెన ప్రజలకు అందుబాటులోకి వస్తుందన్నారు. నమ్మకంతో నన్ను గెలిపించుకున్న ఈ ఊరి కోసం చాలా శ్రద్ధ తీసుకుంటున్నానని తెలిపారు. భూత్పూర్ ను ముంపు గ్రామంగా ప్రకటించడానికి చాలా కష్టపడ్డానని తెలిపారు. ముంపు గ్రామంగా ప్రకటించినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. త్వరలో నేరేడుగామ్, భూత్పూర్ గ్రామాలను తరలించి ఆయా గ్రామాల ప్రజలు సంతోషంగా జీవించే రోజులు దగ్గరలోనే ఉన్నాయని మంత్రి వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సత్యావార్ గ్రామ సర్పంచ్ అనురాధ, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గణేష్, సంబంధిత అధికారులు, మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

# పెండింగ్ ఫైళ్లను పరిష్కరించాలి

### రెవెన్యూ అదనపు కలెక్టర్ జెఎల్‌బి హరిప్రియ



సమీక్షలో మాట్లాడుతున్న రెవెన్యూ అదనపు కలెక్టర్

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఏప్రిల్ 9, ప్రభాతవార్త:** వివిధ విభాగాల్లో పెండింగ్లో ఉన్న ఫైళ్లను తక్షణమే పరిష్కరించాలని రెవెన్యూ అదనపుకలెక్టర్, జెఎల్‌బి హరిప్రియ ఆదేశించారు. రెవెన్యూ, భూభారతి, ఇసుక పంపిణీ, ఎస్ఐఆర్ ఎలక్టోరల్ ఓటరుమ్యాపింగ్, తడిభూముల గుర్తింపు, తదితర అంశాలపై జిల్లా అధికారులు, మండల తహసీల్దార్లు, సర్వేయర్లతో రెవెన్యూ అదనపు కలెక్టర్, జెఎల్‌బి హరిప్రియ, గురువారం కలెక్టర్ కార్యాలయం వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ, భూభారతి పెండింగ్ ఫైళ్లను, పెండింగ్‌లో ఉన్న భూ సర్వే దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలని తహశీల్దార్లను ఆదేశించారు. 60 రోజులకు పైగా పెండింగ్‌లో ఉన్న భూభారతి దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలని, తిరస్కరించబడ్డ అభ్యర్థనలకు సంబంధించిన గల కారణాలను స్పష్టంగా నివేదికలో పేర్కొనాలని సూచించారు. సాదాబైనామ, ఇతర భూ సంబంధిత లావాదేవీల నివేదికలను సిద్ధం చేసే ముందు తప్పనిసరిగా ఇరు పార్టీల వారికి నోటీసులు జారీచేయాలని, క్షేత్ర స్థాయిలో పరిశీలించి తప్పులు లేకుండా నివేదికలను పంపాలని అన్నారు. రాజాపూర్, నవాబ్‌పేట్, మూసాపేట్, మొహమ్మదాబాద్, మహబూబ్‌నగర్ అర్బన్, జడ్చర్ల, గండీడ్, అడ్డాకల్, బాలానగర్, కౌకుంట్ల, కోయిలకొండ మండల తహసీల్దార్ల పరిధిలో అధిక భూభారతి పెండింగ్ కేసులు ఉన్నాయని వాటిని వేగవంతంగా పరిష్కరించి నిర్ణీత గడువులో పూర్తి చేయాలని ఆదేశించారు. పెండింగ్ లో ఉన్న భూ సర్వే కేసుల విషయంలో కూడా తహశీల్దార్లు ప్రత్యేక శ్రద్ధ చూపాలని అన్నారు. ఇప్పటికే 120మంది శిక్షితులైన లైసెన్స్ -మిగతా4లో..

### రెండు పడక గదుల ఇండ్లు

# అద్దెకిస్తే కేటాయింపు రద్దు

### మెడికల్ కళాశాల విద్యార్థుల, సిబ్బంది హాజరు నివేదించాలి

### ఇందిర మహిళా శక్తి భవన నిర్మాణం వేగవంతం కావాలి : కలెక్టర్



ఇందిరమ్మ ఇళ్ల దగ్గర పర్యటిస్తున్న కలెక్టర్, అధికారులు

**గద్వాల ఏప్రిల్ 09, ప్రభాతవార్త :** గద్వాల పట్టణ శివారులోని రెండు పడక గదుల ఇండ్ల సమీపంలో జిల్లా ఆసుపత్రి, మెడికల్, నర్సింగ్ కళాశాలలు, సెంట్రల్ మెడిసిన్ స్టోర్స్ భవనాలు నిర్మించడంతో ఈ ప్రాంతం మెడికల్ హబ్ గా అభివృద్ధి చెందబోతోందని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. గురువారం గద్వాల శివారులో రూ. 5.7 కోట్ల నిధులతో నిర్మిస్తున్న ఇందిర మహిళా శక్తి భవనంతో పాటు పక్కనే కేంద్రీయ విద్యాలయ నిర్మాణానికి ప్రతిపాదించిన స్థలాన్ని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. అలాగే మెడికల్, నర్సింగ్ కళాశాలల భవనాలు, రెండు పడక గదుల ఇండ్ల సముదాయంను సందర్శించారు. భవనంలో నిర్మిస్తున్న డార్మెటరీ హాల్స్, ఓపెన్ డైనింగ్, కిచెన్, తదితర గదులను తిరిగి పరిశీలించారు. భవనం చుట్టూ ప్రహరీ నిర్మాణానికి, ఫర్నిచర్, ఇతర సౌకర్యాలు కల్పించేందుకు అవసరమైన నిధులకై ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కేంద్రీయ విద్యాలయ నిర్మాణానికి ఐదు ఎకరాల స్థలం కావలసి ఉండడంతో రెవెన్యూ అధికారులు ప్రతిపాదించిన స్థలాన్ని కలెక్టర్ పరిశీలించారు. మ్యాప్ ద్వారా పూర్తి వివరాలను సంబంధిత అధికారులు కలెక్టర్‌కు -మిగతా4లో..

# 6 రోజుల అరైవ్.. అలైవ్ కార్యక్రమాలను విజయవంతం చేయాలి

### - ఏప్రిల్ 13వ తేదీ నుంచి 18వ తేదీ వరకు నిర్వహించే అరైవ్, అలైవ్, కార్యక్రమాలు

### - నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఏప్రిల్ 9 ప్రభాతవార్త:** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ ప్రణాళికలో భాగంగా ఏప్రిల్ 13 వ తేదీ నుంచి 18వ తేదీ వరకు నిర్వహించే అరైవ్, అలైవ్ కార్యక్రమాలను విజయవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, రాష్ట్ర డిజిపి శివధర్ రెడ్డి జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలను గురువారం సాయంత్రం హైదరాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆదేశించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు మాట్లాడుతూ రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాలు, ప్రాణ నష్టాలను తగ్గించాలనే సంకల్పంతో పోలీసు శాఖ, రాష్ట్ర రోడ్డు రవాణా శాఖల ఆధ్వర్యంలో నిర్వహించే అరైవ్,



వీడియో కాన్ఫరెన్స్ సమావేశంలో కలెక్టర్, ఎస్పీ

అలైవ్ కార్యక్రమాలను అత్యంత ఘనంగా నిర్వహించాలన్నారు. నాగర్‌కర్నూల్ కలెక్టరేట్ నుండి జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్‌తో కలిసి జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ హాజరయ్యారు. ఈసందర్భంగా వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లాకలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రోడ్డు ప్రమాదాలు, ప్రాణ నష్టాలను తగ్గించాలనే సంకల్పంతో పోలీసు శాఖ అరైవ్.. అలైవ్ ప్రచార కార్యక్రమాలను విరివిగా చేపట్టి ప్రజలకు విద్యార్థులకు అవగాహన కార్యక్రమంలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ బాదావత్ సంతోష్ తెలిపారు. రహదారి భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా రూపొందించిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ ప్రణాళికలో భాగంగా ఈ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం పటిష్ట చర్యలు తీసుకుంటుందని కలెక్టర్ బాదావత్ సంతోష్ వివరించారు. జిల్లాలో రోడ్ సేఫ్టీ సమావేశాలను నిర్వహించడం జరిగిందని, జిల్లా వ్యాప్తంగా గుర్తించిన బ్లాక్ స్పాట్‌ల వద్ద ప్రమాదాలు జరగకుండా అందుకు కావలసిన ఏర్పాట్లను పూర్తిచేయడం జరిగిందని, ప్రజల భాగస్వామ్యంతో రోడ్డు ప్రమాదాలను, మరణాలను తగ్గించడమే జిల్లా యంత్రాంగం ప్రధాన లక్ష్యమని, రోడ్డు భద్రత ప్రాముఖ్యతను ప్రతి పౌరుడి మనసులో బలంగా నాటేందుకే అరైవ్ అలైవ్‌ను కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు. ఈప్రచార కార్యక్రమం ద్వారా ప్రజలకు సురక్షిత డ్రైవింగ్ -మిగతా4లో..

## మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం

**దళారులను నమ్మి రైతులు నష్టపోవద్దు: అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు**

**వడ్డేపల్లి, ఏప్రిల్ 9 ప్రభాతవార్త :** శాంతినగర్ గ్రామంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని గురువారం అలంపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు విజయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడి పంట నాణ్యతను పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు తాము కష్టపడి పండించిన పంటను తక్కువ ధరకు దళారులకు అమ్ముకొని నష్టపోకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వంఈ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని తెలిపారు. ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరకే రైతులు తమ పంటను విక్రయించుకోవాలని తద్వారా ఆర్థికంగా బలోపేతం కావాలని ఆయన కోరారు. రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుంది అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు, జోగులాంబ గద్వాల జిల్లా కిసాన్ అధ్యక్షులు ఎనుముల నాగరాజు, అలంపూర్ మార్కెట్ యార్డ్ చైర్మన్ దొడ్డప్ప /వైస్ చైర్మన్ పచ్చర్ల కుమార్, పచ్చర్ల గోపాల్ రెడ్డి, వడ్డేపల్లి మున్సిపాలిటీ 9వ వార్డు కౌన్సిలర్ వడ్డేపల్లి సూరి, వడ్డేపల్లి దేవేంద్ర, బాబి, జిల్లెడుదిన్నె సర్పంచ్ వెంకటేశ్వర్ రెడ్డి, వివిధ గ్రామాల రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయుడు

## ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి :ఎమ్మెల్యే

**అచ్చంపేట,ఏప్రిల్ 9 ప్రభాతవార్త:** ప్రభుత్వ పాఠశాలల అభివృక్తి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే డా.వంశీకృష్ణ అన్నారు. గురువారం పదర మండలం రాయల గండి గ్రామంలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో రూ.38 లక్షల 15వేలతో నిర్మిస్తున్న అదనపు తరగతి గదుల నిర్మాణానికి అచ్చంపేట ఎమ్మెల్యే డా. వంశీకృష్ణ శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. అనంతరం అమ్రాబాద్ మండలంలోని తెలుగుపల్లి గ్రామంలో కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల ప్రహారీగోడనిర్మాణానికి రూ.54లక్షల 50వేలు కేటాయించి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ కస్తూర్బా గాంధీ విద్యాలయాల్లో బంగారు భవిత ఆడపిల్లల చదువు ఇంటికి వెలుగు మెరుగైన సమాజానికి పునాది పేదరికం కారణంగా వారు చదువుకు దూరం కావొద్దన్నారు. విద్యార్థుల జీవితాలను అంధకారం చేసుకోకూడదు అనే సంకల్పంతో కేజీబీవీలు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

**జిల్లా అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్**

**ఖిల్లా ఘనపురం ఏప్రిల్ 9, ప్రభాతవార్త:** గ్రామంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ అన్నారు. గురువారం మండల పరిధిలోని మలికి మియాన్ పల్లి గ్రామాన్ని పరిశీలించారు. గ్రామంలో వీధులు ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని గ్రామస్తులకు సూచించారు. స్మశాన వాటిక ఆక్రమనకు గురికాకుండా చూడాలని పంచాయతీ కార్యదర్శి కి సూచించారు స్మశాన వాటిక స్థలం తక్కువగా ఉందని శవాలను కాల్చడానికి గ్రామస్తులతో మాట్లాడి వారికి అవగాహన కల్పించాలన్నారు. వేసవిలో గ్రామంలో త్రాగునీటి ఎద్దడి లేకుండా చూసుకోవాలని సర్పంచి, కార్యదర్శికి సూచించారు అనంతరం చిన్నయ్య కుంట వద్ద జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు. చేసిన ఉపాధి పనులకు డబ్బులు పడుతున్నాయా అని కూలీలను అడిగి తెలుసుకున్నారు. తమకు డబ్బులు సరిగ్గా పడడం లేదని డబ్బులు ఎప్పటికప్పుడు పడే విధంగా తగు చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ను కూలీలు కోరారు. ఉపాధి హామీ పనులు జరిగే చోట కూలీలకు త్రాగునీరు వసతి తో పాటు టెంటు వేసి నీడను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రామకృష్ణ ఉప సర్పంచ్ చెన్నయ్య డిపిఓ రఘునాథరెడ్డి, ఎంపీడీవో సునీత, ఎంపీ ఓ నరసింహ ఏపీఓ లక్ష్మి పంచాయతీ కార్యదర్శి రాజ్ కుమార్ పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

## ఆర్టీసీ బస్టాండ్ పునర్నిర్మాణానికి పరిశీలన

**మద్దూరు బస్టాండ్‌కు కొత్త ఊపు**

**మద్దూరు, ఏప్రిల్ 9 ప్రభాతవార్త :** మద్దూరు మున్సిపాలిటీలోని ఆర్టీసీ బస్టాండ్ పునర్నిర్మాణానికి సంబంధించి కొత్త ప్రతిపాదనపై గురువారం కీలక పరిశీలన జరిగింది. ముఖ్యమంత్రి కార్యాలయ ప్రిన్సిపల్‌సెక్రటరీ (రిటైర్డ్ ఐఏఎస్) శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో అధికారులు బస్టాండ్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా బస్టాండ్ పరిధిలో రక్షణగోడ నిర్మాణం, ఆధునిక సౌకర్యాలతో కొత్త బస్టాండ్ ఏర్పాటు వంటి అంశాలపై చర్చించారు. ప్రయాణికులకు సౌకర్యవంతమైన వాతావ రణం కల్పించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో రవాణా శాఖ అధికారులు వెంకన్న (ఈడి – ఆపరేషన్స్), ఖుర్షీద్ ఖాన్ (హైదరాబాద్ జోన్), సంతోష్ కుమార్ (ఆర్‌ఎం – మహబూబ్‌నగర్), వెంకట్ రెడ్డి (స్పెషల్ ఆఫీసర్ – కొడంగల్) పాల్గొన్నారు. అలాగే తహసీల్దార్ మహేష్ గౌడ్, మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్, చైర్‌పర్సన్ సరస్వతి జనార్ధ న్, మాజీ పీఏసీఎస్ చైర్మన్ నరసింహులు, మాజీ జెడ్పీటీసీ రఘుపతి రెడ్డి, కోట్ల మహేందర్ రెడ్డి, కౌన్సిలర్లు గోవిందు, సంజీవ్, మోనిక ప్రకాష్, నాయకులు యాసిన్ , గాజుల ఉస్మాన్, రాజు తదితరులు పాల్గొన్నారు.



మద్దూరు బస్టాండ్‌ను సందర్శిస్తున్న దృశ్యం

## ప్రారంభమైన సంసద్ ఖేల్ మహోత్సవ్

**వాలీబాల్ కబడ్డీ క్రికెట్ పోటీలను ప్రారంభించిన ప్రజా నాయకులు**

**నవాబుపేట, ఏప్రిల్ 9 ప్రభాతవార్త :** పాలమూరు పార్లమెంటు పరిధిలో అతిపెద్ద క్రీడా వేదికగా నిర్వహిస్తున్న ప్రధానమంత్రి సంసద్ ఖేల్ మహోత్సవ్‌లో భాగంగా నవాబ్‌పేట్ మండల పరిధిలోని ఎన్మనగండ్ల హైస్కూల్లో మైదానంలో మండల బిజెపి నాయకులు ఎన్మన్‌గండ్ల సర్పంచ్, ప్రజాప్రతినిధులు, మండల అధికారుల సమక్షంలో అట్టహాసంగా ప్రారంభించారు. నియోజకవర్గ గ్రామాల నుండి యువతి యువకులకు పార్లమెంట్ స్థాయి క్రీడా పోటీలు నిర్వహించబడుతున్నాయి. ఏప్రిల్ 9 నుండి 24 వరకు జరగనున్నా యని మండల సంసద్ ఖేల్ పోటీల ఆర్గనైజేషన్ సభ్యులు , బిజెపి నాయకులు అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువమోర్చా అధ్యక్షులు పల్లె తిరుపతి, జిల్లా కౌన్సిల్ మెంబర్ శ్రీనివాసులు, జిల్లా కార్యవర్గ సభ్యులు మధుసూదన్ రెడ్డి, యువ నాయకులు అర్జున్ రెడ్డి, ఎన్మనగండ్ల సర్పంచ్ రంజిత్ గౌడ్, నవీన్ రెడ్డి, మండల బిజెపి అధ్యక్షులు లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి గణేష్ చారి, హనుమంతు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.



సంసద్ ఖేల్ మహోత్సవ్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

## వృద్ధులకు వైద్య సేవలు అందిస్తాం

**కల్వకుర్తి, ఏప్రిల్ 9 ప్రభాతవార్త:** వృద్ధులకు ఎల్లవేళలా వైద్య సేవలు అందిస్తామని డిప్యూటీ డీఎంహెచ్ఓ భీమానాయక్ అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల ప్రణాళికలో భాగంగా కల్వకుర్తి పట్టణంలోని వృద్ధాశ్రమంలో గురువారం జిజి హెచ్, రఘుపతిపేట పి.హెచ్.సి సబ్ సెంటర్ వైద్యులు, సిబ్బంది వైద్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా వృద్ధులకు రక్తపరీక్షలు, బిపిపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను అందజేశారు. అనంతరం వృద్ధాశ్రమ నిర్వాహకులు పెరుమాళ్ళ వెంకటయ్య అధ్యక్షతన నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్ఓ భీమానాయక్ మాట్లాడుతూ ఆరోగ్య పరిరక్షణలో వృద్ధులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఏప్పుడు ఏ అవసరం ఉన్న సేవలందించేందుకు వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో రఘుపతిపేట పిహెచ్‌సి డాక్టర్ అత్త ఉల్లా ఖాన్, ఎం ఎల్ హెచ్ పి డాక్టర్ వర్షిత్ రెడ్డి, హెల్త్ సూపర్వైజర్ ప్రమోద్, బిఎస్‌కే ప్యాలెట్ సేవా కేంద్రం నర్సింగ్, ఆఫీసర్ విజయలక్ష్మి, ఫిజియోథెరపిస్ట్ లలిత, వృద్ధాశ్రమ కోఆర్డినేటర్ పద్మ, వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు, వృద్ధులు, తదితరులు పాల్గొన్నారు.



వృద్ధులకు వైద్య పరీక్ష నిర్వహిస్తున్న వైద్యులు

## ఏజెన్సీ ప్రాంత రైతుల భూ సమస్యలను

# పరిష్కరించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం

**తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ రైతు కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి**

మొదటి పేజీ తరువాయి భాగం

శాసనసభ్యులు డా.వంశీకృష్ణ, రైతు కమిషన్ సభ్యులు మర్రికంటి భవానీ రెడ్డి, కెవిఎన్ రెడ్డి, రామ్ రెడ్డి గోపాల్ రెడ్డి, రా ములునాయక్, భూమి సునీల్‌కుమార్ హాజరయ్యారు. రైతు సదస్సు కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతాల్లో భూమి హక్కుల గుర్తింపు, పత్రాల సమస్యలు, భూ వివాదాలు వంటి అంశాలు రైతులకు ఇబ్బందులు కలిగిస్తు న్నాయని ఏసీ గదుల్లో కూర్చుని సమస్యను పరిష్కరించలేమని కమిషన్ భావించిందని అందుకే నేరుగా రైతులతో మాట్లాడి సమస్యను తెలుసుకొని రాష్ట్ర ముఖ్యమంత్రితో చర్చించి అందుకు అనుగుణంగా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలనే ఉద్దేశంతోనే నేడు రైతు కమిషన్ సభ్యులతో కలిసి క్షేత్రస్థాయి పర్యటలకు వచ్చినట్లు తెలిపారు. రైతులు కమిషన్ దృష్టికి తీసుకువచ్చిన ఈ సమస్య లను సమగ్రంగా పరిశీలించి, రైతులకు న్యాయం జరిగేలా చర్యలు చేపడుతున్నామని ప్రత్యేకంగా గిరిజన రైతుల భూ హక్కులను రక్షించడం, ప్రభుత్వ విధానాలను సమర్థవంతంగా అమలు చేయ డం రైతు కమిషన్ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలో తీసుకున్న నిర్ణయాల వల్ల నేడు రైతులు ఇబ్బందులకు గురి అవుతున్నారని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయని రైతులకు న్యాయం జరిగే విధంగా ఈ ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంత రైతులు రాష్ట్ర రైతు కమిషన్ దృష్టికి తీసుకువచ్చిన భూ సమస్యల పరిష్కారానికి జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుని రైతులకు న్యాయం జరిగేలా చూస్తామని కలెక్టర్ తెలిపారు. ముఖ్యంగా సాంకేతిక కారణాల వల్ల రైతులకు మార్టిగేజ్, ఎల్టీ లోన్లు అందడం లేదని రైతులు పేర్కొనగా, ఆ సమస్య పరిష్కారానికి ప్రత్యేక కార్యక్రమంతో (స్పెషల్ డ్రైవ్ ) నిర్వహించి సక్సెషన్ ప్రక్రియలను పూర్తిచేసి, నేరుగా బ్యాంకులతో సమన్వయం చేసి రైతులకు రుణాలు అందేలా చర్యలు తీసుకుంటామని, ఇప్పలపల్లి గ్రామ పరిధిలో ఉన్న 200 ఎకరాల భూమిపై రెవెన్యూ మరియు అటవీ శాఖ అధికారులతో జాయింట్ సర్వే నిర్వహించి సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. బక్కలింగాయపల్లి గ్రామ పరిధిలో భూమి సర్వే పూర్తయ్యిందని, ఆ భూమి రెవెన్యూ శాఖ పరిధిలోకి వస్తుందని తెలిపారు. అలాగే బుధవారం హైదరాబాద్‌లో గిరిజన సంక్షేమ శాఖ మంత్రి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను పరిగణనలోకి తీసుకుని, క్షేత్రస్థాయిలో ఎమ్మెల్యే అధ్యక్షతన సమావేశం నిర్వహించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపడతామని నల్లమల్ల అటవీ ప్రాంతంలో ఇదివరకే గుర్తించిన ప్రదేశాల్లో టూరిజం ప్రాంతాలను అభివృద్ధిపరిచి ఈ ప్రాంత అభివృద్ధికి ప్రజల ఆర్థిక అభివృద్ధికి జిల్లా సంఘం కృషి చేస్తుందని కలెక్టర్ ఈ సందర్భంగా రైతు కమిషన్ చైర్మన్‌కు వివరించారు. అచ్చంపేట శాసనసభ్యులు డాక్టర్ వంశీకృష్ణ మాట్లాడుతూ, అచ్చంపేట నియోజకవర్గ పరిధిలోని అమ్రాబాద్, పదర మండలాల్లో ఉన్న నల్లమల్ల ఏజెన్సీ ప్రాంత ప్రజల భూ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం భూ సమస్యల కారణంగా బ్యాంకుల నుండి ఎలాంటి రుణాలు అందడం లేదని, ఈ ప్రాంత రైతుల సమస్యలను పరిష్కరించాలని సంకల్పంతోనే నేడు రైతుల వద్దకే రైతు కమిషన్ చైర్మన్ తన సభ్యులతో కలిసి రావడం సంతోషించదగ్గ విషయమని ఆయన కమిషన్ దృష్టికి తీసుకువచ్చారు. గత ప్రభుత్వం కొంతమంది గిరిజనులకు భూములేనప్పటికీ పట్టాలు ఇచ్చారని, కొంతమంది రైతులు 1932 నుండి భూమిని సాగు చేస్తున్నప్పటికీ వారిపై పట్టాలు లేవని అలాంటి వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి శాశ్వత పరిష్కారం తీసుకునే దిశగా అధికారులు కమిషన్ చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నల్లమల్ల ప్రాంత రైతుల భూ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు భూ దార్" వంటి కార్యక్రమాలను తీసుకువచ్చారని ఆయన పేర్కొన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో పోడు భూముల సమస్యలను పరిష్కరించే దిశగా, అటవీ ప్రాంతాన్ని సంరక్షిస్తూ రైతులకు న్యాయం జరిగేలా ఆయిల్ పామ్ సాగుకు అవకాశం కల్పించాలని,

ఈ క్రమంలో నల్లమల్లలో 24 టూరిజం ప్రాంతాలను గుర్తించినట్లు, నల్లమల్ల ప్రాంత ప్రజలు ఆర్థికంగా స్వావలంబన సాధించేలా తాను కృషిచేస్తానని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈసమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ అమరేందర్, అచ్చంపేట ఆర్డీఓ యాదగిరి, అమ్రాబాద్ సర్పంచ్ బిగుర్ల కోటయ్య, తదితరులు పాల్గొన్నారు.



వేదికపై తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ రైతు కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డితో పాటు జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే డా. వంశీకృష్ణ

## కొనుగోలు కేంద్రాలలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

**ఆత్మకూర్ ఏప్రిల్9, ప్రభాతవార్త:** ప్రస్తుత రబీ సీజన్ కు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేయనున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో నాణ్యతా ప్రమాణాలు కచ్చితంగా పాటించాలని వనపర్తి జిల్లా వ్యవసాయ అధికారి ఆంజనేయులు విజ్ఞప్తి చేశారు. గురువారం రోజు ఆత్మకూరు మండలంలోని జూరాల గ్రామంలో గల రైతువేదిక వద్ద ఏర్పాటుచేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహకులకు మరియు ఇన్చార్జిలకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జిల్లా వ్యవసాయ అధికారి ఆంజనేయులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న వరిధాన్యం కొనుగోలు కేంద్రాలలో ప్రధానంగా పిఎసిఎస్ అధికారులు మరియు మహిళా సంఘాల సభ్యులు తోపాటుగా ఏపీఎంలో కీలక పాత్ర పోషిస్తారని వరి ధాన్యం కొనుగోలు కేంద్రానికి సంబంధించి రైతులకు అన్ని రకాల సూచనలు సలహాలతో పాటుగా రైతులకు అన్ని విధాల సహకరించేందుకు చర్యలు చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఆధీనంలో ఏర్పాటు చేసే వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో లావు రకం మరియు సన్న రకం ధాన్యం కొనుగోలుకేంద్రాలను వేరువేరుగా ఏర్పాటుచేయాలని లావు రకం ధాన్యానికి 2369 రూపాయలు సన్నరకం ధాన్యానికి 2389 రూపాయలు చెల్లించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని అంతేకాకుండా వరిధాన్యం క్వింటాలకు 500 రూపాయలు బోనస్సు లు ఇస్తున్న నేపథ్యంలో రైతులు కచ్చితంగా వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్దే విక్రయించుకునే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. అనంతరం వ్యవసాయ సహాయ సంచాలకులు దామోదర్ జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి తదితరులు మాట్లాడుతూ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద మండల వ్యవసాయ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ కొనసాగిస్తూ నిర్వహణ సక్రమంగా జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు మండల వ్యవసాయ అధికార అరవింద్ పిఎసిఎస్ సీఈవోలు నరేష్ తదితరులతో పాటుగా పలు రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వ్యవసాయ అధికారి ఆంజనేయులు

## మే10 నుంచి జనగణన ప్రారంభం

**ఎన్యూమరేటర్స్, సూపర్‌వైజర్ల నియామకం పూర్తి**

**ఈ నెల చివరి వారంలో శిక్షణ**

**ఉప్పునుంతల, ఏప్రిల్9 ప్రభాతవార్త:** దేశవ్యాప్తంగా నిర్వహించనున్న జనగణన కార్యక్రమానికి సంబంధించి మండలంలో అధికారులు ముమ్మరంగా సన్నాహాలు చేపట్టారు. మే 10వ తేదీ నుంచి ప్రారంభమయ్యే జనగణన ప్రక్రియను విజయవంతంగా నిర్వహించేందుకు మండల ఇంచార్జ్ ఆఫీసర్, తహసీల్దార్ అద్దంకి సునీత ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా తహసీల్దార్ అద్దంకి సునీత మాట్లాడుతూ, మండల పరిధిలో మొత్తం 64 ఇండ్ల బ్లాకులను గుర్తించినట్లు తెలిపారు. జనగణన మొదటి విడతలో గృహాల సంఖ్యతో పాటు కుటుంబాల వివరాలను నమోదు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు మండలంలో 61 మంది ఎన్యుమరేటర్లు, 11 మంది సూపర్వైజర్లను నియమించినట్లు ఆమె వివరించారు. వారికి అవసరమైన శిక్షణ ఇవ్వడానికి ఈనెల 18వ తేదీ నుంచి మే 5వ తేదీ మధ్య మూడు రోజుల పాటు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. జనగణన పూర్తిగా ఆన్లైన్ విధానంలో నిర్వహించబడుతుందని, ప్రతి వివరాన్ని తక్షణమే సి.ఎం.ఎం.ఎస్ పోర్టల్‌లో నమోదు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఇండ్ల జాబితా తయారీ నుంచి గృహాల లెక్కింపు, ఎన్యుమరేటర్లు , సూపర్వైజర్ల నియామకం వరకు అన్ని అంశాలు డిజిటల్ విధానంలో నమోదు జరుగుతున్నాయని వివరించారు. అలాగే ఈసారి స్వీయ జనగణనకు అవకాశం కల్పించినట్లు తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ వివరాలను స్వయంగా నమోదు చేసుకోవచ్చని సూచించారు. స్వీయ గణన పూర్తి చేసిన వారు తమకు లభించిన ఐడి నంబర్‌ను భద్రపరచుకుని, ఇంటికి వచ్చే ఎన్యుమరేటర్‌కు అందించాలని తెలిపారు. జిల్లా సెన్సస్ అధికారుల ఆదేశాల మేరకు జనగణన కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకునే దిశగా అధికారులు కృషి చేస్తున్నారని తహసీల్దార్ పేర్కొన్నారు. ఉన్నతాధికారుల షెడ్యూల్ ప్రకారం అన్ని కార్యక్రమాలను సమయానికి పూర్తి చేస్తామని ఆమె స్పష్టం చేశారు.



అధికారులతో మాట్లాడుతున్న తహసీల్దార్ అద్దంకి సునీత

## విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

**ఆత్మకూర్ ఏప్రిల్ 9, ప్రభాతవార్త :** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్యుత్ రంగంలో ఎదుర్కొంటున్న విద్యుత్ కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎస్ రాజు, టియుసిఐ జిల్లా అధ్యక్షులు ప్రసాద్ తదితరులు డిమాండ్ చేశారు. ఆత్మకూరు మండలంలోని దివజూరాల వద్ద గురువారం రోజు విద్యుత్ ఉద్యోగులు చేపట్టినటువంటి నిరవధిక సమ్మె కార్యక్రమానికి కార్మిక సంఘాల నేతలు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తూ ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలోనే తొలిసారిగా తెలంగాణ రాష్ట్రంలో అవుట్సోర్సింగ్ మరియు కాంట్రాక్ట్ పద్ధతిలో ఉద్యోగులు కొనసాగకూడదు అంటూ తెలంగాణ ఆవిర్భావ సమయంలో గత ముఖ్యమంత్రి చంద్రశేఖర రావు ప్రకటించినప్పటికీ ఆచరణలో మాత్రం ఘోరంగా విఫలమయ్యారని ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సైతం ఆర్టిజన్ విద్యుత్ ఉద్యోగులను పర్మినెంట్ చేయడంలో నిర్లక్ష్యంగా వివరించడం ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నించారు. అంతేకాకుండా దేశవ్యాప్తంగా కార్మికులు నిరవధిక పోరాటాలు నిర్వహించి సాధించుకున్న 44 లేబర్ కోర్లను రద్దుచేసి కేంద్ర ప్రభుత్వం కార్పొరేటర్ రంగాలకు ప్రాధాన్యమిస్తూ కేవలం నాలుగు లేబర్ కోర్టులు కుదించి కార్మికుల పాలిట శాపంగా మార్చిందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా విద్యుత్ ఉద్యోగులు చేపట్టినటువంటి సమ్మె న్యాయమైనదని విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కరించేందుకు తక్షణమే ప్రభుత్వం చొరవ చూపాలని లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలను ఉధృతంగా కొనసాగించేందుకు వెనకాడబోమని వారు హెచ్చరించారు. అంతేకాకుండా 2026 సంవత్సరానికి సంబంధించి పిఆర్సి తక్షణమే అమలు చేయాలని విద్యుత్ కార్మికులందరినీ ఆర్టిజన్ ప్రకారం శాశ్వత ఉద్యోగులుగా గుర్తించి సమాన వేతనం చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులతో పాటుగా విద్యుత్ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రాజు

## క్రీడా మహోత్సవం ప్రతిభను ప్రదర్శించుకునే గొప్ప వేదిక

**జడ్చర్ల ఏప్రిల్ 9, ప్రభాతవార్త :** భారతదేశపు అతిపెద్ద క్రీడా వేదికగా నిర్వహిస్తున్న ప్రధానమంత్రి క్రీడా మహోత్సవం పాలమూరు పార్లమెంట్ పరిధిలో ఘనంగా కొనసాగుతోంది. ఇందులో భాగంగా నేడు జడ్చర్లమండలం లింగంపేట్‌గ్రామంలో జడ్చర్ల బిజెపి మండల అధ్యక్షులు యాట రామకృష్ణ ముదిరాజ్‌గారి ఆధ్వర్యంలో లింగంపేట్‌లో ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు పద్మజరెడ్డి గారు హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, యువతలో క్రీడాస్ఫూర్తి పెంపొందించడానికి ఇలాంటి క్రీడా కార్యక్రమాలు ఎంతో అవసరమని తెలిపారు. గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల్లో క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా ప్రతిభావంతులైన క్రీడాకారులు వెలుగులోకి వస్తారని అన్నారు. ప్రధానమంత్రి క్రీడా మహోత్సవం యువతకు తమ ప్రతిభను ప్రదర్శించుకునే గొప్ప వేదికగా నిలుస్తోందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో టోర్నమెంట్ ప్రారంభోత్సవంలో లింగంపేట్ గ్రామ సర్పంచ్ బాలస్వామి మరియు డిప్యూటీ సర్పంచు మండల పదాధికారులు వివిధ మోర్చా నాయకులు బిజెపి కార్యకర్తలు బూతు అధ్యక్షులు పాల్గొనడం జరిగింది అలాగే స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, క్రీడాకారులు మరియు యువకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు పద్మజరెడ్డి

## ఫీల్డ్ అసిస్టెంట్‌పై గ్రామస్థుల ఆగ్రహం

**అక్రమాలపై ఎంపీడీవోకు వినతి**



ఎంపిడిఓకు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

**మద్దూరు, ఏప్రిల్ 9 ప్రభాతవార్త :** మద్దూరు మండలం దమగాన్పూర్ గ్రామంలో ఫీల్డ్ అసిస్టెంట్ వెంకట్రాములు పై గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉపాధి హామీ పనుల్లో అక్రమాలు, కార్మికులతో అనుచిత ప్రవర్తన, డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఆరోపించారు. గ్రామసభలో ఈ అంశంపై చర్చించి, వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంపీడీవో రామన్నకు వినతిపత్రం సమర్పించారు. దీనిపై ఎంపీడీవో స్పందిస్తూ, పూర్తి స్థాయి విచారణ జరిపించి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈకార్యక్రమంలో మాజీసర్పంచ్ పి.బాల్‌రెడ్డి, ఉపసర్పంచ్ మొగులమ్మ, కె.కృష్ణయ్య, గొల్ల మధు, బి.బీములు, ఎం.నరసప్ప, కిష్టప్ప ,కె.నరేష్, పి.అనిల్ గౌడ్, మహేష్, కమ్మరి ఈరప్ప, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## బిజ్వారంలో చలివేంద్రం ప్రారంభం

**మల్దకల్ ఏప్రిల్ 9, ప్రభాతవార్త:** జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం పరిధిలోని బిజ్వారంలో వైయస్సార్ సర్కిల్ దగ్గర గురువారం గ్రామ సర్పంచ్ వై. శైలజ శ్రీనివాస్ రెడ్డి, ఉప్పరి కిష్టన్న చలివేంద్రాన్ని సర్పంచ్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మల్దకల్ ఎస్సై కొండ శ్రీహరి హాజరై చలివేంద్రాలను గ్రామ సర్పంచ్ వై శైలజ శ్రీనివాసరెడ్డి, గ్రామ పెద్దలు మీసాల రాజారెడ్డి, రిబ్బన్ కట్ చేసి వారి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రస్తుతం ఎండలు అత్యధికంగా ఉండడంతో ప్రజలకు చల్లని నీటిని అందించేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేయడం మంచి నిర్ణయమని చెప్పారు. ప్రజలు ఎండలో తిరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి, బసిరెడ్డి, ఉపసర్పంచ్ చాపల కండ్ల కర్రన్న, గ్రామ నాయకులు శ వెంకటేశ్వర రెడ్డి, వినయ్ కుమార్ రెడ్డి, గోకారన్న, సుభాన్ తెలుగు కృష్ణమూర్తి, మాజీ సర్పంచ్ కృష్ణ, మాజీ సర్పంచ్ తిమ్మన్న, ఎల్లప్పనాయుడు, బోయ గోవిందు, భద్రయ్య, వడ్డే గోపాల్, గోపాలకృష్ణ, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

### చింతలపల్లి ప్రాథమిక పాఠశాలను

## ఆకస్మిక తనిఖీ చేసిన ఎంఈఓ

**కొల్లాపూర్, ఏప్రిల్ 9 ప్రభాతవార్త :** కొల్లాపూర్ నియోజకవర్గంలోని పాఠశాల పర్యవేక్షణలో భాగంగా ఎస్ఎ టు ఎగ్జామ్స్ ప్రారంభమైన సందర్భంగా చింతలపల్లి ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ పి ఇమ్మానుయేల్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం 4వ తరగతి విద్యార్థుల తెలుగు పరీక్ష పరిశీలించడం జరిగింది. విద్యార్థుల ప్రశ్న పత్రం వాళ్ల రాసే విధానాన్ని చూసి ఈ పరీక్షలు మన ఉన్నత తరగతులకు దోహదం చేస్తాయి అని విద్యార్థులందరు మంచిగా చదువుకొని పరీక్ష స్పష్టంగా రాయాలని సూచించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం అరుణ్ కుమార్, ఉపాధ్యాయులు భరత్, రాములు సీఆర్పీ మహ్మద్ అలీ పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నాయకుడిపై దాడి ఫిర్యాదు

**బిజినేపల్లి, ఏప్రిల్ 9 ప్రభాతవార్త:** బోయాపూర్ గ్రామంలో కాంగ్రెస్ నాయకుడు సైదులు పై అదే గ్రామానికి చెందిన ఇరువురు దాడి చేసినట్లు తెలిపారు. గ్రామంలో గత ఏడాది జాతీయ ఉపాధి హామీ పథకం కింద రూ. 10 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టినట్లు వివరించాడు. సైదులు గ్రామపంచాయతీలో తన పేర తీర్మానం చేయించుకుని గుత్తేదార్ తో సిసి రోడ్ల నిర్మాణం చేపట్టినట్లు వివరించారు. సిసి రోడ్ల నిర్మాణానికి గాను మెటీరియల్ తో పాటు నిధులను సమకూర్చినట్లు తెలిపారు. రెండు రోజుల క్రితం బిల్లులు కావడంతో గుత్తేదారుకు సంబంధించిన సొమ్ము చెల్లించి తనకు రావాల్సిన నిధిని తీసుకున్నట్లు తెలిపాడు. కాగా అదే గ్రామానికి చెందిన ఇరువురు తాము కాంగ్రెస్ పార్టీకి చెందిన వారమని తమకు కమిషన్ చెల్లించాలంటూ తన భార్యతో పాటు వెళ్తున్న తనపై అకారణంగా దాడి చేసి గాయపరిచినట్లు వివరించాడు. ఇందుకు సంబంధించి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు వివరించాడు.



దాడిలో గాయపడ్డ కాంగ్రెస్ నాయకుడు దాసర్ల సైదులు



ఈవిఎంల గోదాంను పరిశీలించిన జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

## ఈవీఎంల వద్ద పటిష్ట భద్రత

**నారాయణ పేట,ఏప్రిల్9 ప్రభాతవార్త:** నారాయణ పేట జిల్లా కేంద్రంలో భద్రపరిచిన ఈవీఎంల గోదాం పటిష్ట భద్రత మధ్య ఉన్నదని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. పట్టణంలోని ఆర్టీసీ బస్ స్టాండ్ ఎదుట ఉన్న ఈవీఎం గోదామును నెలవారీ తనిఖీల్లో భాగంగా అదనపు కలెక్టర్లు ఫణీంద్ర రెడ్డి, శ్రీనుతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా సీసీ కెమెరాలు, భద్రతా ఏర్పాట్లు, పోలీసుల బందోబస్తును సమగ్రంగా పర్యవేక్షించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ఈవీఎంగోదామును నిరంతరం తనిఖీ చేస్తూ సంబంధిత నివేదికలను సమర్పిస్తున్నామని కలెక్టర్ తెలిపారు.నెలవారీ తనిఖీల్లో భాగంగానే పరిశీలన నిర్వహించినట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ అమరేంద్ర కృష్ణ, కలెక్టరేట్ సీ సెక్షన్ అధికారులు జయసుధ, రాణి దేవి పాల్గొన్నారు.

## ఆత్మ నిర్భర్ నిధి పథకంపై అవగాహన

**చిన్న చింతకుంట, ఏప్రిల్9 ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి స్ట్రీట్ ఆత్మ నిర్భర్ నిధి పథకానికి చిన్న చింతకుంట గ్రామం ఎంపికైంది. ఈ పథకం పై గురువారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో వీధి వ్యాపారులకు అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా లీడ్ బ్యాంకు మేనేజర్ డి.ఎన్ .చంద్రశేఖర్ మాట్లాడుతూ ఆత్మ నిర్భర్ నిధి పథకం కింద గ్రామానికి చెందిన వీధి వ్యాపారస్తులకు బ్యాంకు రుణాలు అందిస్తుందన్నారు. వీధి వ్యాపారులు తమ వ్యాపారాన్ని మరింత అభివృద్ధి చేసుకునేందుకుగాను ఈ పథకం ఎంతో దోహదపడుతుందన్నారు. గ్రామంలోని విధి వ్యాపారస్తులు బ్యాంకు రుణాలకై దరఖాస్తులను గ్రామ పంచాయతీ నందు అందజేయాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో గ్రామ సర్పంచ్ మానస దశరథ్, ఎంపీడీవో లక్ష్మి నర్సింహులు, యూనియన్ బ్యాంక్ మేనేజర్ సనత్ కుమార్ రెడ్డి, సెర్ప్ అధికారులు, వీధి వ్యాపారస్తులు పాల్గొన్నారు.

## మంత్రి వాకిటి శ్రీహరికి వార్డ్ కౌన్సిలర్ అల్కురి పావని వినతి



**మక్తల్ టౌన్, ఏప్రిల్ 9 ప్రభాతవార్త:** మక్తల్ నియోజకవర్గం లోని మినీ ట్యాంక్ బండ్ వద్ద తెలంగాణ అమర వీరుల స్తూపంతో పాటు తెలంగాణ తల్లి విగ్రహాన్ని ప్రతిష్టించాలని కోరుతూ రాష్ట్ర పాడి పశుసంవర్ధక మత్స్య డైరీ క్రీడాశాఖ మంత్రి వాకిటి శ్రీహరికి 16వ వార్డు కౌన్సిలర్ అల్కూరి పావని గురువారం వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా అల్కూరి పావని మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రకోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరుల స్మారకంగా స్తూపంను మినీ ట్యాంక్ బండ్ వద్ద ఏర్పాటు చేయాలని కోరారు. తెలంగాణ తల్లి విగ్రహాన్ని సైతం ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బి.గణేష్ కుమార్,కోఆప్షన్ సభ్యులు వల్లంపల్లి లక్ష్మణ్,కాంగ్రెస్ టౌన్ ప్రెసిడెంట్ ఏ. రవికుమార్, రంజాన్ రాజా, బాసిద్బిన్ ఉమర్, మహమ్మద్, వలియోద్దీన్, అక్కల రాకేష్ ,అనంపల్లి రమేష్, వల్లంపల్లి ప్రవీణ్‌కుమార్,అమ్రేష్ ,కడేచూర్ రాజేష్, దామరగిద్ద రాము, తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పనులు, ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించిన ఎంపీడీవో

**దేవరకద్ర, ఏప్రిల్9 ప్రభాతవార్త:** మెరుగైన జీవనోపాధి కోసం ఉపాధి హామీ పనులను వినియోగించుకోవాలని ఎంపీడీవో శ్రీనివాసరావు అన్నారు. గురువారం దేవరకద్ర మండలం జీనుగురాల గ్రామంలో ఉపాధి హామీ పనులను, అంగన్‌వాడీ సెంటర్లను,ఇందిరమ్మ ఇండ్లను, పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కూలీలతో ప్రత్యేకంగా మాట్లాడారు. ఉదయంసమయంలో వచ్చి ఉపాధి హామీపనులు చేసుకుంటున్నట్లు కూలీలు వివరించారు. అదేవిధంగా జీనుగురాలలో అమలు అవుతున్న ప్రభుత్వ పథకాల పనితీరును పరిశీలించేందుకు ఎంపీడీవో సందర్శించారు. అంగన్‌వాడి సెంటర్లను తనిఖీ చేసి, అక్కడి సౌకర్యాలు నిర్వహణపై ఆరా తీశారు. ప్రజలకు అందుతున్న సేవలు మెరుగ్గా ఉండేలా చర్యలు తీసుకోవాలని, ఎక్కడైనా లోపాలు ఉంటే వెంటనే సరిదిద్దాలని అధికారులకు ఎంపీడీవో ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల పనితీరు వేగవంతం చేయాలని ఎంపీడీవో శ్రీనివాసరావు అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జీనుగురాల సర్పంచ్ నాగమ్మ సాయిలు, ఉపసర్పంచ్ నరహరి, పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

## మా పంట పొలాలలో చెట్ల సర్వే చేయొద్దు



వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

**కల్వకుర్తి, ఏప్రిల్ 9 ప్రభాతవార్త:** ఇర్విన్ రిజర్వాయర్ నిర్మాణంలో భాగంగా అజీలాపూర్ గ్రామా నికి చెందిన భూములలో చెట్ల సర్వేను నిలిపివేయాలని గ్రామ సర్పంచ్ సిద్ధగోని రమేష్ గౌడు ఆధ్వర్యంలో రైతులు అటవీ శాఖ అధికారుల తోపాటు సిఐ రఘు వీర్‌రెడ్డికి వినతి పత్రం అందించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు తగినంత నష్టపరిహారం నిర్ణయించకుండా సర్వే చేయడం సరికాదని తమకు సరైన నష్టపరిహారం నిర్ణయించాక చెట్ల సర్వేను చేపట్టాలని, లేదంటే ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ శంకర్, రవిగౌడ్ గ్రామ ప్రజలు రైతులు ఉన్నారు.

## సిపిఐ ఆధ్వర్యంలో కొల్లాపూర్‌లో గర్జన మహాధర్నా

**కొల్లాపూర్,ఏప్రిల్ 9 ప్రభాతవార్త :** భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆధ్వర్యంలో ఏప్రిల్ 12వ తేదీన జడ్చర్ల, కొల్లాపూర్, నంద్యాల రైల్వే లైన్ల సాధన కోసం సిపిఐ తలపెట్టిన కొల్లాపూర్ గర్జన మహా ధర్నా కార్యక్రమాని జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ఎండి ఫయాజ్ ప్రజలకు పిలుపునిచ్చారు. గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్వాతంత్రం సిద్ధించిన తొలి నాటి నుంచి నేటి వరకు అనేక పార్టీల నాయకులు, ప్రభుత్వాలు జడ్చర్ల టు నంద్యాల కొల్లాపూర్ మీదుగా రైల్వే లైన్లు సాధిస్తాం తెస్తామని ఎన్నో ప్రకటనలు చేస్తూ వచ్చారని అవి నేటికీ నెరవేరలేదని ఈరోజు గద్వాల మాచర్ల లైన్ కి గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన ప్రభుత్వం జడ్చర్ల కొల్లాపూర్ మీదిగా నంద్యాలకు వెళ్లే లైన్‌ను మాత్రం నిర్లక్ష్యం చేస్తుందని ఆయన ఆరోపించారు. ఇందుకు నిరసిస్తూనే కొల్లాపూర్ ప్రాంతానికి వరప్రసాదంగా మారనున్న రైల్వే లైన్ల సాధన కోసం సిపిఐ పోరాటం ప్రారంభిస్తుందని అందులో భాగంగానే ఏప్రిల్ 12వ తేదీన కొల్లాపూర్ పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో కొల్లాపూర్ గర్జన పేరుతో మహాధర్నా కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని ఫయాజ్ తెలిపారు. ఈ కార్యక్రమానికి సిపిఐ జాతీయ కార్యదర్శి,మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకటరెడ్డి ,సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.బాల నరసింహ, ఇతర నాయకులు హాజరవుతున్నారని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పెబ్బేటి విజయుడు, ఆర్ ఇంద్ర కొల్లాపూర్ మండల కార్యదర్శి తుమ్మలశివుడు, కోడేరు మండల కార్యదర్శి తప్పెట కిరణ్ కుమార్, పెద్దకొత్త పల్లి మండల సహాయ కార్యదర్శి లక్ష్మీనారాయణ,కొల్లాపూర్ పట్టణ కార్యదర్శి ఎండి యూసుఫ్, సహాయ కార్యదర్శి రమణ, పెంట్లవెల్లి మండల సహాయ కార్యదర్శి నిరంజన్ నాయుడు, మండల నాయకులు సంఘం కృష్ణ, జంగం శివుడు, చేపల శేఖర్ తదితరులతో కలిసి మాట్లాడారు.

## బాధితులకు అండగా పోలీస్ శాఖ

**బాధితురాలి ఇంటికే వెళ్లి ఎఫ్ఐఆర్ నమోదు చేసిన ఎస్సై**



ఎఫ్ఐఆర్ నమోదు చేస్తున్న ఎస్సై వెంకటేష్‌గౌడ్

**ధన్వాడ, ఏప్రిల్ 9 ప్రభాతవార్త :** ధన్వాడ మండలంలో పోలీస్ శాఖ ప్రజల సమస్యలపై సత్వర స్పందన చూపుతోంది. బాధితులు పోలీస్ స్టేషన్‌కు రావాల్సిన అవసరం లేకుండా అవసరమైతే వారి ఇంటి వద్దకే వెళ్లి ఫిర్యాదులు స్వీకరించి ఎఫ్ఐఆర్ నమోదు చేస్తున్నామని ధన్వాడ ఎస్సై వెంకటేష్‌గౌడ్ తెలిపారు. మండలంలోని ఎంనోన్‌పల్లి గ్రామానికి చెందిన పెద్దమల్ల అనురాధ అనే మహిళ, ఐదేళ్ల క్రితం దేవరకద్ర మండలం లక్ష్మీపల్లి గ్రామానికి చెందిన పెద్దమొల్ల రవితో వివాహం చేసుకుంది. వీరికి ఒక బాబు, ఒక పాప ఉన్నారు. అయితే వివాహం జరిగిన ఏడాది నుంచే అదనపు కట్నం కోసం భర్తరవి, అత్తతిరుపతమ్మ తనను శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నారని బాధితురాలు ఫిర్యాదు చేసింది. ఫిర్యాదుఅందుకున్న వెంటనే ఎస్సై వెంకటేష్ గౌడ్ పోలీస్ సిబ్బందితో కలిసి బాధితురాలి ఇంటికి చేరుకుని,అక్కడికక్కడే ఫిర్యాదును స్వీకరించి కేసు నమోదు చేశారు. అనంతరం ఎఫ్ఐఆర్ కాపీని బాధితురాలికి అందజేశారు.ఈ కేసుపై దర్యాప్తు కొనసాగుతోందని ఎస్సై తెలి పారు. ప్రజలు ఎలాంటి సమస్యలు ఎదురైనా వెంటనే పోలీసులను సంప్రదించాలని, బాధితులకు తక్షణ సహాయం అందించేందుకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.

# జిల్లాలో వంట గ్యాస్‌కు ఎలాంటి కొరత లేదు

**- నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్**



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఏప్రిల్ 9 ప్రభాతవార్త:** జిల్లాలో వంట గ్యాస్,సరఫరా వ్యవస్థను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అధికారులకు సూచించారు. ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్లు అక్రమ వినియోగంపై కఠిన చర్యలు తీసుకోవాలని, పోలీస్ శాఖ అధికారులతో సమన్వయంతో పనిచేసే జిల్లాలో అక్రమ సిలిండర్ల వినియోగంపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీపాటిల్, అదనపు కలెక్టర్ అమరేందర్, అదనపు ఎస్పి వెంకటేశ్వర్లు, సివిల్ సప్లై అధికారి నరసింహారావు, మున్సిపల్ కమిషనర్లతో కలెక్టర్ జిల్లాలో గ్యాస్ వినియోగంపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అధికారుల బృందం జిల్లా వ్యాప్తంగా తనిఖీలు ముమ్మరం చేసి అవసరమైన సందర్భాల్లో కేసులు నమోదు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పోలీస్ రెవెన్యూ సివిల్ సప్లై అధికారులతో ప్రత్యేక బృందాలతో జిల్లాలో ఆకస్మిక దాడులు నిర్వహించి అక్రమంగా వినియోగించే సిలిండర్లు జప్తు చేసుకొని క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కలెక్టర్ ఆదేశించారు.గ్యాస్ డీలర్లు గృహ అవసరాలకు వినియోగించే వంటగ్యాస్ సిలిండర్లను వ్యాపార అవసరాలకు అక్రమంగా వినియోగిస్తే డీలర్లు లైసెన్స్‌ను రద్దు చేసి కేసులు నమోదు చేస్తామని కలెక్టర్ హెచ్చరించారు.జిల్లాలో గ్యాస్ సరఫరాకు ఎటువంటి కొరత లేదని, తగినంత నిల్వలు అందుబాటులో ఉన్నాయని, సరఫరాలోఎలాంటి సమస్యలు లేవని ప్రజలకు గ్యాస్ ఏజెన్సీలు, గ్యాస్‌బుకింగ్ చేసిన తర్వాత, సంబంధిత ఏజెన్సీలు వినియోగదారుల ఇళ్ల వద్దకే సిలిండర్‌ను సరఫరా చేస్తాయని తెలిపారు. ఎవ్వరు గ్యాస్ ఏజెన్సీలు లేదా గోదాముల వద్దకు స్వయంగా వెళ్లి వేచి ఉండవద్దని స్పష్టంచేశారు.షెడ్యూల్ ప్రకారం వినియోగదారుల తేదీ వచ్చినప్పుడు గ్యాస్ సిలిండర్‌ను తప్పనిసరిగా ఇంటి వద్దకే అందజేస్తామని హామీ ఇచ్చారు. జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ మాట్లాడుతూ జిల్లాలో గ్యాస్ సిలిండర్ల అక్రమ వినియోగాన్ని అరికట్టేందుకు పోలీస్ శాఖ సహకారం తీసుకోవాలని,జిల్లాలో ఎక్కడైనా ఇలాంటి సమస్యలు ఉంటే వెంటనే పోలీసుల దృష్టికి తీసుకువెళ్లాలని చెప్పారు. అలాంటి ఫిర్యాదులపై అవసరమైన చర్యలను పోలీస్ శాఖ తప్పకుండా తీసుకుంటుందని ఎస్పీ సూచించారు.

## రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలి

◆ జిల్లా వ్యవసాయ అధికారి ఆంజనేయులు



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి అంజనేయులు

**మదనాపురం, ఏప్రిల్9 ప్రభాతవార్త :** రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా సాగేలా ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్లాలని జిల్లా వ్యవసాయ అధికారి ఆంజనేయులు ఆదేశించారు. గురువారం మండల కేంద్రంలో రైతు వేదికలో ధాన్యం కొనుగోలుపై ఏపీఎంలు, ఐకేపీ కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు,బుక్‌కీపర్లకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరిధాన్యం కొనుగోలు కేంద్రాలకు రానుందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారన్నారు. సింగల్ విండో,ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న కొనుగోలు కేంద్రాల్లో టెంట్లు వేయించాలని, తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉండాలని తెలిపారు. తూకం వేసే యంత్రాలు, తేమ శాతం చూపే యంత్రాలు, టార్పాలిన్లు, గన్నీబ్యాగులు సరిపడా సమ కూర్చుకోవాలని ఆదేశించార. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా అన్ని కొనుగోలు కేంద్రాల్లో నాణ్యతా ప్రమాణాలు, ఇతర వివరాలతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని సూచించారు. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ కొనుగోళ్లు చేయాలని ఆదేశించారు. సంబంధిత ఏఈవో ధ్రువీకరించిన తరువాత కొనుగోలు చేయాలని, కేటాయించిన మిల్లులకు మాత్రమే ధాన్యాన్ని పంపించాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో సమస్యలు రాకుండా ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని సూచించారు. ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమో దుచేయాలని తెలిపారు. అన్ని కొనుగోలు కేంద్రాల నిర్వాహకుల వద్ద రైస్‌మిల్లర్లు, ట్రాన్స్‌ఫోర్టు కాంట్రాక్టర్లు,అధికారుల ఫోన్‌నంబర్లు అందుబాటులో ఉండాలని తెలిపారు. హమాలీల కొరత లేకుండా చూసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో సివిల్ సప్లైస్ జిల్లా మేనేజర్ ఆంజనేయులు,డీఆర్డీవో విశ్వనాథ్, మండల వ్యవసాయఅధికారి గాయత్రి,మార్కెట్ చైర్మన్ ప్రశాంత్, మార్కెట్ వైస్‌చైర్మన్‌తిరుపతిరెడ్డి,మండల నాయకులుమహేష్, ఏపీఎంలు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తా

◆ గ్రూప్ తగాదాలను ఎండగడతా... ◆ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు చీమ్ముల రాజశేఖర్ రెడ్డి



నూతన అధ్యక్షులుగా ఎన్నికైన రాజశేఖర్ రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

**వంగూరు, ఏప్రిల్ 9 ప్రభాతవార్త:** వంగూరు మండలంలోని ప్రతి గ్రామంలో కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేసి ఎదురులేని శక్తిగా కాంగ్రెస్ పార్టీని కార్యకర్తల సమన్వయంతో ముందుకు తీసుకెళ్లడమే నా లక్ష్యమని నూతనంగా ఎంపికైన వంగూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిమ్ముల రాజశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. నూతనంగా మండల అధ్యక్షులుగా ఎంపికైన సందర్భంగా మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు నూతన అధ్యక్షులు చిమ్ముల రాజశేఖర్‌రెడ్డిని, జిల్లా ప్రధాన కార్యదర్శి పులిజాల కృష్ణరెడ్డిని శాలువా పూలమాలతో ఘనంగా సన్మానించారు. చిమ్ముల రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ మండలంలో కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేస్తానని స్పష్టం చేశారు. పార్టీలో ఏర్పడిన గ్రూప్ తగాదాలను ఎండగట్టి ఎక్కడ గ్రూపు రాజకీయాలకు తావులేకుండా, పాత కొత్త నాయకులందరినీ సమన్వయపరుస్తూ, అందరినీ కలుపుకుని పార్టీని ముందుకు తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.మండలంలో ఇప్పటివరకు పార్టీ బలోపేతానికి అహర్నిశలు పనిచేసిన ప్రతి కార్యకర్తకు సముచిత స్థానం కల్పించి కార్యకర్తలే పార్టీకి పట్టుకొమ్మలనే నానుడిని నిజం చేసి కార్యకర్తలకు అండగా నిలుస్తానని ఆయన పేర్కొన్నారు. నాకు ఈ అవకాశం కల్పించిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, టీపీసీసీ ఉపాధ్యక్షుడు,డీసీసీ అధ్యక్షులు,అచ్చంపేట ఎమ్మెల్యే వంశీ కృష్ణలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. మండల, జిల్లా స్థాయి నాయకులు,కార్యకర్తలు అభిమానులు పాల్గొని రాజ శేఖర్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కార్య దర్శి యాదగిరి రావు, మాజీ మండల అధ్యక్షులు పండిత్ రావు, సీనియర్ నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి, నరేందర్ రెడ్డి, హరీష్ రెడ్డి,వర్కింగ్ ప్రెసిడెంట్ బాదమోనిరమేష్, నాయకులు చంద్ర శేఖర్, గఫూర్,నకినమోని శేఖర్,జనార్ధన్,రమేష్, మీసాలస్వామి, బండమీదసత్యనారాయణ, తెల్దపల్లి రాజురావు, హమీద్, సురేష్, రమేష్, దశరథం, తదితరులు పాల్గొన్నారు.

## పియూలో ఉత్సాహంగా స్పోర్ట్స్ మీట్



పియూలో స్పోర్ట్స్ మీట్‌లో పాల్గొన్న క్రీడాకారులు

**మహబూబ్‌నగర్, ఏప్రిల్ 9, ప్రభాతవార్త:** పాలమూరు యూనివర్సిటీలో 99రోజుల ప్రగతి ప్రణాళికలో భాగంగా పాలమూరు యూనివర్సిటీలో చదువుతున్న విద్యార్థులకు ఇంటర్ డిపార్ట్మెంటల్ స్పోర్ట్స్ మీట్ 2026 ప్రారంభించారు. ఇందులో క్రీడాకారులకు షటిల్, బ్యాట్మింటన్, చెస్, క్యారమ్స్, కబడ్డీ ఆటల పోటీలను పాలమూరు యూనివర్సిటీ విభాగాల వారీగా పోటీలను నిర్వహించడం జరుగుతుందన్నారు. అందులో భాగంగా గురువారం షటిల్ బాడ్మింటన్, శుక్రవారం క్యారమ్స్, చెస్, శనివారం కబడ్డీ పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. పోటీలకు ముఖ్య అతిథులుగా పాలమూరు యూనివర్సిటీ ఉపకులపతి జీఎన్ శ్రీనివాస్, రిజిస్ట్రార్ ప్రొ॥ పూస రమేష్ బాబు, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ డా. ప్రవీణ, కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపాల్ డా. కర్ణాకర్‌రెడ్డి హాజరై క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడారు. క్రీడల్లో మంచి స్కిల్స్‌ను పెంపొందించుకొని పాలమూరు యూనివర్సిటీకి మంచి పేరు తీసుకురావాలన్నారు. మ్యూజిక్, స్పోర్ట్స్ క్లబ్‌ను ఏర్పాటు చేసి క్రీడాకారులు నిరంతరం ప్రాక్టీస్ చేసే దిశగా ప్రయత్నాలు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా క్రీడాకారులకు క్రీడలు ప్రతి సంవత్సరం నిర్వహించడం ద్వారా క్రీడాకారుల్లోని ప్రతిభను వెలికితీయవచ్చని పాలమూరు యూనివర్సిటీ ఫిజికల్ డైరెక్టర్ డా. వై.శ్రీనివాసులు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఫిజికల్ ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్ స్టాఫ్‌ఎం. శారద, మన్యం, అభిషేక్‌లతో పాటు క్రీడాకారులు పాల్గొన్నారు.ఈ పోటీలకు అఫిషియల్‌గా కే.శంకర్, వెంకటేష్, బదేసబ్‌లు వ్యవహరించారు.

# బడి బయట పిల్లలను బడిలో చేర్పించాలి





లక్ష్మాపూర్‌లో నిర్వహించిన బడిబాట అవగాహన ర్యాలీ

**ఉప్పునుంతల, ఏప్రిల్9 ప్రభాతవార్త:** బడిఈడు కలిగి బడి బయటఉన్న పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులను కోరారు. గురువారం మండలంలో పిఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు బడి బాట 2026,27 సంవత్సరానికి గాను ప్రత్యేక ప్రవేశాల నమోదు కార్యక్రమంలో భాగంగా మొల్గర, పెద్దాపూర్, లక్ష్మాపూర్, జప్తి సదగోడు గ్రామాలలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగాప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం, రాగి జావ, ఉపకార వేతనాలు, ఉచిత ఏకరూప దుస్తులు, ఉచిత పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాల గురించి విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసిన పిఎం శ్రీ పాఠశాలలో లభించే ఆధునిక విద్యా ప్రమాణాలు,డిజిటల్ తరగతులు, ఉత్తమ వసతుల గురించి వివరిస్తూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వపాఠశాలలో విద్యను అందించడం జరుగుతుందని,ప్రైవేటుపాఠశాలలో వేలరూపాయలు ఫీజులు చెల్లించాల్సి ఉంటుందని, ప్రభుత్వ పాఠశాలలో పైసా చెల్లించాల్సిన అవసరం లేదని,ఈఅవకాశాన్ని విద్యార్థుల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఇంటింటి ప్రచార కార్య క్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు నీలంశ్రీధర్, శ్రీనివాసులు, చంద్రశేఖర్, మల్లారెడ్డి,వీరోజురాజు తదితరులు పాల్గొని విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. వారితో పాటు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు మొగిలి వెంకటయ్యలు పాల్గొన్నారు.

## ఉమామహేశ్వరంలో ప్రత్యేక పూజలు చేసిన రైతు కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి



**అచ్చంపేట, ఏప్రిల్ 9 ప్రభాతవార్త:** శ్రీశైలం దేవస్థానానికి ఉత్తర ద్వారంగా బాసిల్లుతున్న శ్రీ ఉమామహేశ్వర క్షేత్రంలో గురువారం తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ రైతు కమిటీ చైర్మన్ కోదండ రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా ఆయనకు ఆలయ పాలక మండలి ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. అనంతరం పూజారులు రుద్రభిషేకం కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం ఆలయ చైర్మన్ బీర మాధవరెడ్డి, ఈవో శ్రీనివాసరావులు శాలువాతో ఘనంగా సన్మానించారు. వ్యవసాయ శాఖ చైర్మన్ కోదండ రెడ్డి మాట్లాడుతూ ఇక్కడికి వచ్చే భక్తలకు ఏర్పాటు చేసిన వసతులను చూసి పాలకమండలి చైర్మన్ ను అభినందించారు. ఈ క్షేత్రం మహిమాన్విత క్షేత్రమని అన్నారు. ఆయనతో పాటు కేవీయన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం వేగవంతం చేయాలి

● అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్

**మహబూబ్‌నగర్, ఏప్రిల్ 9, ప్రభాతవార్త:** ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం నాణ్యతతో వేగవంతంగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ ఆదేశించారు. అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన అర్బన్ డే సమావేశంలో నగర పాలక సంస్థ కమిషనర్, ముగ్గురు మున్సిపల్ కమిషనర్లు సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఈ సమావేశంలోప్రగతిలో ఉన్నఅభివృద్ధి పనులు, పారిశుద్ధ్య కార్యక్రమాలు, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనుల పురోగతిని సమీక్షించారు. పనులు సమయానికి పూర్తయ్యేలా నాణ్యతతో అమలు చేయాలని సంబంధిత అధికారులకు ఆయన ఆదేశించారు.

## 70% సబ్సిడీతో పాడి గేదెల పథకం

● ఈ నెల 16 వరకు దరఖాస్తుకు అవకాశం

● జిల్లా కలెక్టర్, ఎస్‌సి కార్పొరేషన్ చైర్మన్ ఖుష్బూ గుప్తా

**మహబూబ్‌నగర్, ఏప్రిల్ 9, ప్రభాతవార్త:** ఎస్.సి.యాక్షన్ ప్లాన్ 2025,26 కార్యక్రమంలో భాగంగా 70 శాతం సబ్సిడీతో (2) పాడి గేదెల పథకం చేసుకునేందుకు ఈ నెల 16 వరకు గడువు పొడిగించినట్లు జిల్లా కలెక్టర్,ఎస్‌సి కార్పొరేషన్ చైర్మన్ ఖుష్బూ గుప్తా ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత, ఆసక్తికల షెడ్యూల్డు కులాల అభ్యర్థులు హెచ్‌టిటిపిఎస్// టిజిఓబిఎంఎంఎస్‌న్యూ.సిజిజి.జిఓవి.ఇన్ ద్వారా దరఖాస్తులు నమోదు చేసుకోవచ్చని ఆమె తెలిపారు. ఆన్లైన్ లో ధరఖాస్తు చేసుకున్నవారు సంబంధిత పత్రాలు మండల కార్యాలయము, మున్సిపల్ కార్యాలయంలో (2) జిరాక్స్‌కాపీలు సమర్పించగలరని,ఇతర వివరములకు 984990 5996 నందు సంప్రదించాలని ఆమె ఈ ప్రకటనలో తెలిపారు.

## ఐమాక్స్ లైట్లు ఏర్పాటు

**చిన్న చింతకుంట, ఏప్రిల్ 9 ప్రభాతవార్త:** మండలంలోని పర్దిపూర్ గ్రామంలో ఆయా వీధుల్లో ఐమాక్స్ లైట్లు లేక గ్రామస్తులు రాత్రి వేళల్లో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని గ్రామ సర్పంచ్ తెలుగు శివకుమార్ గ్రామంలోని ఐదు ఐమాక్స్ స్తంభాలకు లైట్లు అమర్చారు. గ్రామాభివృద్ధిలో భాగంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వీధిలైట్లతో పాటు ఐమాక్స్ లైట్లును కూడా ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. సర్పంచ్ వెంట ఉప సర్పంచ్ నిరంటీ నరసింహారెడ్డి, పంచాయతీ కార్యదర్శి కురుమన్న తదితరులు ఉన్నారు.

## విద్యార్థులకు అవగాహన సదస్సు

**మిడ్జిల్, ఏప్రిల్ 9 ప్రభాతవార్త:** సిఆర్పిఎఫ్ సాహస దినోత్సవం పురస్కరించుకొని క్లాస్ మెంట్ క్లబ్బు ఆధ్వర్యంలో జడ్పీహెచ్‌ఎస్ ఉన్నత పాఠశాలలో గురువారం నాడు నిర్వహించారు. ఈ సందర్భంగా క్లాస్ మెట్ క్లబ్ అధ్యక్షుడు యన్నం సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థులుచిన్నప్పటినుండి క్రమశిక్షణ దేశభక్తి అలవాటు చేసుకోవాలని సూచించారు.పోలీస్ శాఖ సిఆర్పిఎఫ్ సిబ్బంది దేశ రక్షణ కోసం చేస్తున్న సేవలు ఆదర్శనీయమని ప్రతి విద్యార్థి చదువుతోపాటు క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. ఆరవ తరగతి నుండి తొమ్మిదవ తరగతి వరకు చదువుకున్న విద్యార్థులకు ప్రత్యేకంగా ప్రజెంటేషన్ నిర్వహించారు.సిఆర్పిఎఫ్ సాహసాలు క్రమశిక్షణ ధైర్యము వంటి అంశాలను వివరించారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు క్లాస్మెంటు ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్ గుప్తా, కోశాధికారి ఎండి జాంగిర్, సభ్యులు జులారి యాదగిరి, బారిగెల ఆదాము, రమేష్ గుప్తా, విద్యార్థిని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం

**పెద్దమందడి, ఏప్రిల్ 9 ప్రభాతవార్త:** పెద్దమందడి మండల కేంద్రంలోని శ్రీ సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో గురువారం స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించడంతో పాటు విద్యా వ్యవస్థ పై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ప్రతి ఏడాది నిర్వహించబడుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా సుమారు 25 మంది విద్యార్థులు వివిధ ప్రభుత్వ అధికారుల పాత్రలను పోషించి ఆకట్టుకున్నారు. కార్య క్రమానికి ముఖ్య అతిథులుగా వనపర్తి జిల్లా ప్రబంధ కరణి, అధ్యక్షులు సూర్యనారాయణ, కోశాధికారి గట్టుమీది భానుప్రసాద్, స్కూల్ కార్యదర్శిఅరవింద్, స్కూల్ టీచర్స్ గ్రామస్తులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో రిటైర్డ్ ఉద్యోగికి గాయాలు

**బిజినేపల్లి, ఏప్రిల్ 9 ప్రభాతవార్త:** పాలెం అంబేద్కర్ చౌరస్తాలో గురువారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో రిటైర్డ్ ఉద్యోగి తీవ్రగాయాల పాలయ్యాడు. వెంకటేశ్వర దేవాలయ ఆవరణ నుండి సొంత బైక్ పై పాల కోసం వెళ్తుండగా బిజినేపల్లి నుండి నాగర్ కర్నూల్ వైపు వెళ్తున్న భారీ వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లక్ష్మి నారాయణ రెడ్డి తలకు, కాలుకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడ్డ అతన్ని నాగర్‌కర్నూల్ ఏరియా ఆసుపత్రికి తరలించి వైద్యుల సూచన మేరకు హైదరాబాదులోని యశోద ఆసుపత్రిలో చికిత్సలు చేస్తున్నట్లు కుటుంబీకులు తెలిపారు. ఆయన ఆరోగ్య పరిస్థితి విషమంగాఉన్నట్లు గ్రామస్తులు తెలిపారు.ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకొని, ప్రమాదానికి కారణమైన వాహనాన్ని స్టేషన్‌కు తరలించి దర్యాప్తు జరుపుతున్నారు.

## రోడ్డు విస్తరణలో తప్పుడు కొలతలు

మున్సిపల్ కమిషనర్‌కు నోటీసులు

**పెబ్బేరు, ఏప్రిల్9 ప్రభాతవార్త:** పెబ్బేరు పురపాలక కేంద్రం వనపర్తి వెళ్లే రహదారిలో చేపట్టిన రోడ్డు విస్తరణ పనుల్లో తప్పుడు కొలతలు చేశారని గత నెలలో బాధితులు శ్రీధర్ రెడ్డి మున్సిపల్ కమిషనర్ అండ్ అసిస్టెంట్ డైరెక్టర్ మమతకు ఫిర్యాదు చేశారు. పట్టణంలోని సుభాష్ చౌరస్తా నుండి పిజెపి కెనాల్ వరకు 500 మీటర్లు రోడ్డు నిర్మాణంలో భాగంగా రోడ్డుకు అటు 40, 40 ఫీట్లు విస్తీర్ణంలో డ్రైనేజీ నిర్మాణాలను చేపట్టాలి. ఒకవైపు 40 ఫీట్లుగా డ్రైనేజీ నిర్మాణం సైతం పూర్తి చేశారు. మరోవైపు సుభాష్ చౌరస్తా నుండి పోలీస్ స్టేషన్ వరకు 40 ఫీట్లుగా డ్రైనేజీ నిర్మాణం చేపట్టారు. అక్కడినుండి పిజెపి కెనాల్ వరకు జరుగుతున్న డ్రైనేజీ నిర్మాణాల్లో ( 35 ఫీట్లు)తక్కువ కొలతలు చేశారని, బాధితులతో అధికారులు కాంట్రాక్టర్లు కుమ్మక్కై తక్కువ కొలతలకు డ్రైనేజీ నిర్మాణాలను చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అందుకు ఆమె ఇష్టారాజ్యంగా వ్యవహరించడం సరైనది కాదన్నారు. క్షేత్రస్థాయిలో పనులు పరిశీలించాలని ఆమె సూచించారు. దీంతో మున్సిపల్ కమిషనర్ టిపిఓ ఏఈ ఆర్అండ్‌బి తార అధికారులకు నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు.

## 10న కొత్తకోటకు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ రాక

**బీసీ కులాల ఐక్య వేదిక కన్వీనర్ గౌనికాడి రాములు యాదవ్**

**కొత్తకోట, ఏప్రిల్9 ప్రభాతవార్త:** బీసీ కులాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన మున్సిపల్ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లతో పాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజాప్రతినిధులకు సన్మాన కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి పద్మశ్రీ మందకృష్ణ మాదిగ, సీనియర్ జర్నలిస్ట్ విట్టల్, విజన్ తెలుగు స్టేట్స్ కోఆర్డినేటర్ నక్క మహేష్ యాదవ్ ముఖ్య అతిథులుగా హాజరు కానున్నారు. వనపర్తి జిల్లా, దేవరకద్ర నియోజకవర్గానికి చెందిన ఎస్సీ,ఎస్టీ,బీసీ, మైనార్టీ ప్రజలు, తాజా మాజీ ప్రజాప్రతినిధులు, విద్యావంతులు, మేధావులు, విద్యార్థులు, యువతతో పాటు వివిధ కుల సంఘాల కమిటీల నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని బీసీ కులాల ఐక్యవేదిక నాయకులు కోరారు.కార్యక్రమంలో కొత్త గంగాధర్ ముదిరాజ్,శివశంకర్, విజయ్,హోటల్‌కురుమూర్తియాదవ్ పాల్గొన్నారు.

